క్లుప్తంగా

పరిశోధనల్లోనూ పోటీతత్వం ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న చైతన్యరాజు

రాజానగరం: నేటి ఆధునిక సమాజంలో అన్నింటిలోనూ పోటీతత్వం పెరుగుతోందని, ఇదే క్రమంలో పరిశోధనల్లో కూడా పోటీతత్వాన్ని అలవర్చుకుని, నూతనావిష్కరణలో ముందడుగు వేయాలని గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ) చాన్సలర్ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు) అన్నారు. యూనివర్సిటీలో పీహెచ్‌డీ మొదటి బ్యాచ్ అడ్మిషన్లు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పీహెచ్‌డీ చేసేందుకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులను ఉద్దేశించి మాట్లాడుతూ భావితరాలకు, సమాజానికి ప్రయోజనం చేకూర్చే విధంగా పరిశోధనలు ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఛాన్సలర్ డాక్టర్ యు.చంద్రశేఖర్, డీన్ డాక్టర్ ఎస్ఎస్ఎన్ రాజు, రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంఎంఎస్ శర్మ, డైరెక్టర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

రామకృష్ణ మిషన్‌కు రూ.లక్ష విరాళం



రామకృష్ణ మిషన్ ప్రతినిధులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

పెదపూడి: రాజమహేంద్రవరంలో పేదలకు 35 ఏళ్లుగా వైద్య సేవలు అందిస్తున్న రామకృష్ణ మిషన్‌కు అనపర్తి రామకృష్ణ సేవాసమితి లక్ష రూపాయల విరాళం అందించింది. ఈ మేరకు అనపర్తి వివేకానంద సెంటర్‌లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో సమితి విరాళానికి సంబంధించి రూ.లక్ష చెక్కును ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి చేతుల మీదుగా రామకృష్ణ మిషన్ చారిటబుల్ డిస్పెన్సరీ డైరెక్టర్ స్వామి రఘువీరానందాజీ మహరాజ్‌కు అందించారు. కార్యక్రమంలో ఎన్డీఏ నాయకులు సత్తి దేవానందరెడ్డి, కర్రి వెంకట రామారెడ్డి, తమలంపూడి సుధాకర్‌రెడ్డి, సమితి అధ్యక్షుడు పడాల సుబ్బారెడ్డి, ఉపాధ్యక్షుడు సత్తి వెంకటరెడ్డి పాల్గొన్నారు.

ఏఈగా శిరీష



ఏఈ శిరీషకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలుకుతున్న సిబ్బంది

రంగంపేట: విద్యుత్ శాఖ ఏఈగా టి.శిరీష మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె రాజమహేంద్రవరం సెక్షన్ డి-1 నుంచి బదిలీపై రంగంపేట వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ ఏఈగా పనిచేసిన సీహెచ్ నాగేశ్వరరావు ఈతకోటకు బదిలీ అయ్యారు. కాగా కొత్తగా బాధ్యతలు స్వీకరించిన శిరీషను స్థానిక సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిశారు. ఆమెకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

పట్టభద్రుల ఓటు నమోదుకు దరఖాస్తులు

సీతానగరం: పట్టభద్రుల ఓటు నమోదుకు స్థానిక తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చని తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ తెలిపారు. ఆయన మంగళవారం మాట్లడుతూ ఆంధ్రప్రదేశ్ విధాన పరిషత్ పట్టభద్రుల నియోజకవర్గం ఓటర్ల జాబితాను అప్‌డేట్ చేస్తున్నారన్నారు. మండలంలో నివాసితులై, 2024 నవంబర్ ఒకటికి పట్టభద్రులుగా మూడేళ్లు పూర్తిచేసుకున్నవారు అర్హులన్నారు.

సెల్‌ఫోన్ల అధిక వినియోగంతో అనర్థాలు

రాజానగరం: పరిమితికి మించిన సెల్‌ఫోన్ల వినియోగంతో అనర్థాలు జరుగుతాయని గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ చాన్సలర్ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు) అన్నారు. స్థానిక గైట్ డిగ్రీ కాలేజీలో మంగళవారం జరిగిన ఫ్రెషర్స్ డేకి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జూనియర్లకు సీనియర్లు ఆదర్శంగా నిలవాలని, స్నేహపూరిత వాతావరణంలో కలిసి చదువుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ చాన్సలర్ డాక్టర్ యు.చంద్రశేఖర్, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వల్లీమాధవి పాల్గొన్నారు.

రామాలయం అందరిదీ

సీతానగరం: పురుషోత్తపట్నంలోని రామాలయం అందరికి సంబంధించిందని టీడీపీ నాయకుడు మండ రాంబాబు మంగళవారం తెలిపారు. ×సాక్షి× దినపత్రికలో ×రామాలయంపై టీడీపీ నాయకుల దుశ్చర్య× అనే శీర్షికతో వచ్చిన కథనంపై ఆయన స్పందించారు. ఆయన మాట్లాడుతూ రామాలయం సేవా బృందం పేరుతో కొందరు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారన్నారు. గుడి తాళాలు ఎవ్వరికీ ఇవ్వకపోవడంతో స్వామివారి దర్శనం చేసుకునే భక్తులకు ఇబ్బంది కలుగుతోందన్నారు. రామాలయంతో గ్రామస్తులందరికీ సంబంధం ఉందని స్పష్టం చేశారు. రామాలయ సేవాబృందం సభ్యులు ఎప్పటిలాగే పూజా కార్యక్రమాలు నిర్వహించుకోవచ్చని, ఆ విషయంపై ఎవ్వరికీ అభ్యంతరం లేదన్నారు.

దసరా ఉత్సవాలకు సర్వం సిద్ధం

- ముస్తాబవుతున్న ఆలయాలు
- ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు
- రేపటి నుంచి 12 వరకూ ఉత్సవాలు



వడిశలేరులోని విజయదుర్గమ్మ ఆలయం

పెదపూడి: దేవి శరన్నవరాత్ర ఉత్సవాలకు అనపర్తి నియోజకవర్గంలో దుర్గాదేవి అమ్మవారి ఆలయాలు ముస్తాబవుతున్నాయి. గురువారం నుంచి ఈ నెల 12వ తేదీ వరకూ ఉత్సవాలను ఘనంగా నిర్వహించడానికి భక్తులు, ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్సవాలు జరిగే పది రోజుల పాటు నిత్యం వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుంటారు. ఈ నేపథ్యంలో ఆలయాలు, పరిసర ప్రాంతాలను అందంగా ముస్తాబు చేస్తున్నారు. విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరిస్తున్నారు. కొన్నిచోట్ల ఆలయాల వద్ద భారీ సెట్టింగులు ఏర్పాటు చేస్తున్నారు. దసరా ఉత్సవాల సందర్భంగా కుంకుమ పూజలు ఘనంగా జరుగుతున్నాయి. పెద్ద ఎత్తున మహిళలు వీటిలో పాల్గొంటారు. ఈ నేపథ్యంలో ఉత్సవాల సందర్భంగా ఆయా ఆలయాలు, మంటపాల వద్ద కుంకుమ పూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

అమ్మవారి అలంకరణలు

దసరా సందర్భంగా అమ్మవారు వివిధ రూపాలలో భక్తులకు దర్శనమిస్తారు. 3న బాలత్రిపుర సుందరి, 4న గాయత్రీదేవి, 5న అన్నపూర్ణాదేవి, 6న లలితా త్రిపుర సుందరి, 7న మహాచండీదేవి, 8న సరస్వతీ దేవి, 9న దుర్గాదేవి, 10న మహాలక్ష్మి, 11న మహిషాసుర మర్ధని, 12న రాజరాజేశ్వరిదేవి అలంకరణలో దర్శనమివ్వనున్నారు. దశమి రోజున విజయదుర్గగా అలంకరించి విశేష పూజలు చేస్తారు.

ఆలయాల ముస్తాబు

అనపర్తి దేవీచౌక్ సెంటర్‌లోని కనకదుర్గాదేవి ఆలయంలో దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నారు. సమీపంలో దుర్గాదేవి ఆలయం, వీరుళ్లమ్మ పీఠంలో వద్ద కూడా వేడుకలు జరుగుతాయి. ఈ పీఠంలో సుమారు 200 మంది భవానీ భక్తులు మాలధారణ గావిస్తారు. అనపర్తి నారయ్య నూతివీధిలోని కర్రి లచ్చారెడ్డి ఇంటి వద్ద సుమారు 25 ఏళ్లుగా పీఠం ఏర్పాటు చేస్తున్నారు. అలాగే ఉమారామలింగేశ్వరస్వామి ఆలయం, శాంతిపురంలోని మహాలక్ష్మిదేవి ఆలయాలు నవరాత్ర వేడుకలకు ముస్తాబు అవుతున్నాయి.



అనపర్తి దేవీచౌక్ సెంటర్‌లోని అమ్మవారి ఆలయం



మామిడాడలో కనకదుర్గ



సంపరలో కొలువైన విజయదుర్గమ్మ

- పాలమూరు గ్రామంలోని దేవీ సెంటర్, పీరా రామచంద్రపురంలోని నూకాంబిక అమ్మవారి ఆలయాల్లో ఏర్పాట్లు జరుగుతున్నాయి.
- రంగంపేట మండలంలో వడిశలేరులో విజయదుర్గ, రంగంపేటలో కనకదుర్గ, చంద్రేడులో శ్రీదేవి కనకదుర్గ, సింగంపల్లి, దొంతమూరు, ఈలకొలను గ్రామాల్లో దేవీ నవరాత్రుల ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు.

విజయదుర్గాదేవి దర్శనం శుభకరం



శరన్నవరాత్ర ఉత్సవాల సందర్భంగా విజయదుర్గమ్మను దర్శించుకోవడం శుభకరం. అమ్మవారికి పది రోజుల పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. అమ్మవారు ఒక్కొక్క అవతారంలో దర్శనమిస్తారు.

– ఖండవిల్లి హనుమంతాచార్యులు, సంపర విజయదుర్గమ్మ ఆలయ అర్చకుడు

- పెదపూడి మండలం పెద్దాడ గ్రామంలో రామాలయం వద్ద దుర్గాదేవి అమ్మవారిని నెలకొల్పి దసరా ఉత్సవాలు నిర్వహించనున్నారు. విజయదశమి రోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు పెద్ద ఎత్తున భారీ అన్నసంతర్పణ నిర్వహిస్తారు. రాత్రికి కన్నులపండువగా దసరా ఉత్సవం జరుపుతారు.
- జి.మామిడాడ అయ్యప్పస్వామి ఆలయంలోని కనక దుర్గాదేవి, తుల్యభాగ నదీపాయవద్ద, మెయిన్ రోడ్డులో నేరేళ్లమ్మ గుడి, మార్కెట్, గండ్రేడు సెంటర్‌లో దుర్గాదేవి ఆలయాల వద్ద ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఆలయాలు వద్ద పీఠాలు ఏర్పాటు చేస్తారు. భవానీ మాలధారణగావించిన భక్తులు ప్రత్యేక పూజలు చేస్తారు.
- బిక్కవోలులో పార్వతీదేవి, ఊలపల్లిలో కనకదుర్గమ్మ, పందలపాలకలో కట్లమ్మతల్లి, తొస్సిపూడిలో నవదుర్గాదేవి, కొమరిపాలెం కనక దుర్గాదేవి, బలభద్రపురం, కొంకుదురు గ్రామాల్లో దసరా ఉత్సవాలను భక్తులు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించనున్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి పూజలు



సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

బిక్కవోలు: గ్రామంలో కొలువైన కుమార సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని మంగళవారం సందర్భంగా ప్రత్యేకంగా అలంకరించారు. భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దేవదాయశాఖ ఆధ్వర్యంలో అన్నసమారాధన జరిపారు.

పాఠ్యపుస్తకాల పంపిణీ



పుస్తకాలు అందుకున్న విద్యార్థులతో నాయకులు

బిక్కవోలు: చదువే మనిషికి ఉన్నత స్థాయిలో నిలుపుతుందని ఎంపీటీసీ సభ్యుడు కొంకుదురు పీవీ అన్నారు. స్థానిక ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మంగళవారం పాఠ్య పుస్తకాలు అందించారు. ఈ సందర్భంగా కొంకుదురు పీవీ మాట్లాడుతూ చిన్నతనం నుంచి చదువుపై ఆసక్తి పెంచుకుని, క్రమశిక్షణతో చదువుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ, వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు నల్లమిల్లి అమ్మిరెడ్డి, మాజీ సొసైటీ అధ్యక్షుడు సత్తి నాగిరెడ్డి రాజా, మాజీ వైస్ ఎంపీపీ చింతా శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

రసాయన ఎరువుల వినియోగం తగ్గించాలి



కానవరంలో పంటలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు



బలభద్రపురంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

రాజానగరం: వ్యవసాయంలో రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి, సేంద్రియ ఎరువులతో ప్రకృతి వ్యవసాయం చేయడం ద్వారా మంచి దిగుబడులతోపాటు ఆరోగ్యవంతమైన పంటలను పండించవచ్చని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు రైతులకు సూచించారు. మండలంలోని కానవరంలో మంగళవారం నిర్వహించిన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో గ్రామంలో సాగు చేసిన పంటలను పరిశీలించారు. అనంతరం రైతులతో సమావేశమయ్యారు. మండలంలో సాగు చేసిన వరి పంటకు అక్కడక్కడా బ్యాక్టీరియా ఆకు ఎండు తెగులు ఆశించినట్టుగా గుర్తించామన్నారు. అధిక నత్రజనిని వాడటం, పొటాష్‌ని అసలు వాడకపోవడం, తెగులు సోకిన పొలాల నుంచి ఆరోగ్యవంతమైన పొలాలకు సాగునీరు ప్రవహించడం వల్ల ఈ తెగులు వ్యాపిస్తుందన్నారు. ఈ తెగులు ఆశించిన పొలంలో వెంటనే నత్రజని ఎరువుల వాడకాన్ని నిలిపి వేయాలన్నారు. వ్యవసాయాధికారులు సిఫారసు చేసిన విధంగా అంకురం దశలో పొటాష్ ఎరువును మ్యూరేట్ ఆఫ్ పొటాష్ రూపంలో ఎకరాకు 20 కిలోలు చొప్పున చల్లాలన్నారు. పొలంలో నిల్వ ఉన్న నీటిని మురుగునీటి కాలువల్లోకి రెండు, మూడు సార్లు తీసివేయాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి షేక్ ఇమామి ఖాసిమ్ పాల్గొన్నారు.

ఆధునిక వ్యవసాయం పరిజ్ఞానం అవసరం

పెదపూడి: రైతులకు ఆధునిక వ్యవసాయ పరిజ్ఞానంపై అవగాహన అవసరమని వ్యవసాయశాఖ కాకినాడ ఏడీఏ ప్రశాంతి అన్నారు. సంపర గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రశాంతి మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణంలో ఆకు ఎండు తెగులు ఉధృతి ఎక్కువగా ఉందన్నారు. దాని నివారణకు సుడోమోనాస్ మందును ఎకరాకు ఒక కేజీ చొప్పున పిచికారీ చేయాలన్నారు. నాణ్యమైన అధిక దిగుబడులు సాధించేందుకు మేలైన కొత్త వంగడాలను ప్రోత్సహిస్తున్నామన్నారు. నూతన యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. భూసార పరీక్షలను సకాలంలో సమర్థంగా నిర్వహించి, సమతుల్య ఎరువులు, సూక్ష్మ పోషకాల యాజమాన్యంపై రైతులకు వివరిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా రైతులు అడిగిన పలు సందేహాలను ఆమె నివృత్తి చేశారు. కార్యక్రమంలో ఏఓ టీవీఆర్ మణిదీప్, ఏఈఓ సత్యనారాయణస్వామి, వీఏఏ విజయ పాల్గొన్నారు.

రైతుల కోసమే 'పొలం పిలుస్తోంది'

బిక్కవోలు: రైతుల కోసమే పొలం పిలుస్తోంది అనే కార్యక్రమం నిర్వహిస్తున్నామని వ్యవసాయశాఖ ఏవో శామ్యూల్ జాన్ అన్నారు. బలభద్రపురంలోని నల్లమిల్లి సుబ్బారెడ్డి వ్యవసాయ క్షేత్రం వద్ద మంగళవారం పరిశీలన, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యులు నల్లమిల్లి వెంకట సుబ్బారెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు కె.శ్రీనివాసు పాల్గొన్నారు.

ఉత్సాహంగా చెకుముకి పోటీలు



సీతానగరంలో పోటీలో పాల్గొన్న విద్యార్థులతో ఉపాధ్యాయులు



బలభద్రపురంలో విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎంఈవో -2 పూర్ణచంద్రరావు

సీతానగరం: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సీతానగరం ప్రభుత్వ హైస్కూల్లో మంగళవారం మండల స్థాయి చెకుముకి పోటీలు నిర్వహించారు. చెకుముకి మండల కన్వీనర్ కన్నూరి సతీష్‌బాబు అధ్యక్షతన జరిగిన ఈ పోటీల్లో సుమారు 36 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సతీష్ బాబు మాట్లాడుతూ ప్రభుత్వ స్కూల్ నుంచి ఒక టీమ్, ప్రైవేటు స్కూల్ నుంచి మరో టీమ్‌ను ఈ నెల 27న రాజమహేంద్రవరంలో జరిగే జిల్లాస్థాయి పోటీలకు పంపుతామన్నారు. టీమ్‌లో ముగ్గురు విద్యార్థులు ఉంటారని తెలిపారు. కాగా.. రఘుదేవపురం హైస్కూల్, శ్రీహర్షవర్ధన స్కూల్ ఈ పోటీల్లో గెలుపొందాయి. కార్యక్రమంలో హెచ్ఎం ఎం.వీరభద్రరావు, యూటీఎఫ్ అధ్యక్షుడు పాపారావు, జేవీవీ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ సత్యం రమేష్‌బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెదపూడి: జిల్లా స్థాయిలో జరిగే చెకుముకి టాలెంట్ పరీక్షకు మండలం నుంచి ఒక జట్టును ఎంపిక చేశారని పెదపూడి గాంధీ మెమోరియల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.సత్యనారాయణ తెలిపారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ తమ పాఠశాలలో మండల స్థాయిలో జనవిజ్ఞాన వేదిక తరపున చెకుముకి టాలెంట్ పరీక్ష నిర్వహించారన్నారు. జిల్లా జట్టుకు ఎంపికైన వారిని ఉపాధ్యాయులు, జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులు అభినందించారు.

బిక్కవోలు: విజ్ఞాన శాస్త్రం సమాజ శ్రేయస్సుకు ఉపయోగపడాలని ఎంఈవో - 2 కె.పూర్ణచంద్రరావు అన్నారు. చెకుముకి మండల కన్వీనర్ కొప్పిశెట్టి శ్రీకృష్ణసాయి ఆధ్వర్యంలో బలభద్రపురం ఉన్నత పాఠశాలలో మండల స్థాయి చెకుముకి పరీక్షలు నిర్వహించారు. వీటిలో పందలపాక ఉన్నత పాఠశాలకు చెందిన భరత్ కుమార్, ధనుష్, సాయి టీమ్ ప్రథమ, ఊలపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన దుర్గాలక్ష్మి, గౌరీ శంకర్, అఖిల టీమ్ ద్వితీయ స్థానంలో నిలిచాయన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కేవీ రాఘవులు పాల్గొన్నారు.

వివాదానికి కారణమైన ఫ్లెక్సీ తొలగింపు



శ్రీరంగపట్నం చెరువుగట్టుపై ఫ్లెక్సీని తొలగిస్తున్న పంచాయతీ అధికారులు

మధురపూడి: కోరుకొండ మండలం శ్రీరంగపట్నం చెరువుగట్టుపై వివాదానికి కారణమైన ఫ్లెక్సీ ఫ్రేమ్‌ను పంచాయతీ అధికారులు మంగళవారం తొలగించారు. ఎన్నికలకు ముందు వైఎస్సార్ సీపీ నాయకులు ఏర్పాటు చేసిన ఆ ఫ్రేమ్‌పై కూటమికి చెందిన ఫ్లెక్సీ ఏర్పాటు చేయడం వివాదానికి కారణమైన విషయం తెలిసిందే. కాగా.. ఈ ఘటనలో దాడికి గురైన వారిపైనే కేసులు పెట్టడాన్ని పార్టీ నాయకులు కొయిడాల నానాజీ, తనకాల ప్రసాద్, సూరిశెట్టి కుటుంబరావు, దాడి వీరబాబు తప్పుపట్టారు. ఈ మేరకు మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ దాడికి గురైన బాధితులందరూ పోలీసు స్టేషన్‌వద్ద ఉండగా పంచాయతీ అధికారులు వైఎస్సార్ సీపీకి చెందిన ఫ్రేమ్‌ను మాత్రమే తొలగించడమేమిటని ప్రశ్నించారు. ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా తొలగించడాన్ని తప్పుపట్టారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తొలగించామని పంచాయతీ అధికారుల బదులు చెప్పారని, వాటిని చూపించమంటే కంగుతిన్నారన్నారు. దీంతో మిగిలిన సగభాగాన్ని అలాగే వదిలేశారన్నారు. అదే చెరువుగట్టుపై ఉన్న ఇతర ఫ్లెక్సీలను కూడా తొలగించాలని పంచాయతీ అధికారులను డిమాండ్ చేశామన్నారు. సోమవారం జరిగిన దాడిలో గాయపడిన తమపై పోలీసులు కేసు నమోదు చేయడం దారుణమన్నారు. బాధితులమైన తాము కేవలం ముగ్గురిపై మాత్రమే ఫిర్యాదు చేశామన్నారు. కానీ కూటమి నాయకుల ప్రోద్బలంతో మరో వర్గానికి చెందిన తమ వర్గంలోని ఏడుగురిపై ఫిర్యాదు చేశారన్నారు.

సామాజిక పింఛన్ల పంపిణీ



రాజుపాలెంలో పింఛన్ పంపిణీ చేస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డి

పెదపూడి: ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ మండలంలో 98 శాతం పూర్తయ్యిందని ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎం.సత్యనారాయణరెడ్డి తెలిపారు. ఆయన రాజుపాలెం, పెదపూడి గ్రామాల్లో మంగళవారం పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని 18 గ్రామ పంచాయతీల్లో 10,495 పింఛన్లు ఉన్నాయని, వాటిలో 10,285 మంది లబ్ధిదారులకు పంపిణీ పూర్తి చేశామన్నారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శులు మన్యం శ్రీనివాసు చౌదరి, బి.ప్రసన్నకుమార్, తరుణ్ పాల్గొన్నారు.

బిక్కవోలు: మండలంలోని బలభద్రపురంలో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మంగళవారం పింఛన్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ తొలిరోజే నూరుశాతం అందించే దిశగా పంపిణీ జరుగుతుందన్నారు. ప్రతి గ్రామంలోని కూటమి నాయకులు పర్యవేక్షిస్తున్నారన్నారు.

రంగంపేట: మండలంలో 98 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్టు ఎంపీడీఓ పి.వెంకటరత్నం తెలిపారు. మండలంలోని 8,899 మంది లబ్ధిదారులకు గాను మంగళవారం సాయంత్రం 4 గంటలకు 8,745 మందికి పంపిణీ చేశామన్నారు. సాంకేతిక సమస్యలు వచ్చిన వారికి బుధవారం అందిస్తామన్నారు.

క్రాఫ్ట్ పోటీల్లో ప్రతిభ



క్రాఫ్ట్ టీచర్ లక్ష్మి, విద్యార్థి శిరీషను అభినందిస్తున్న హెచ్ఎం పార్థసారథి

రంగంపేట: క్రాఫ్ట్ పోటీల్లో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన క్రాఫ్ట్ టీచర్ బి.లక్ష్మితో పాటు విద్యార్థులు ప్రతిభ చూపారు. ఈ విషయాన్ని మంగళవారం స్కూలు హెచ్ఎం పార్థసారథి విలేకరులకు తెలిపారు. కాట్రేనికోన క్రియేటివ్ ఆర్ట్స్ అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ 9వ వార్షికోత్సవం సందర్భంగా గ్రామీణ భారతం పేరుతో గత నెల 29న కాకినాడ న్యూ సెంచరీ స్కూల్లో క్రాఫ్ట్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పాఠశాలకు చెందిన క్రాఫ్ట్ టీచర్ బి. లక్ష్మి చేసిన క్రాఫ్ట్‌కు అవార్డు లభించింది. 9వ తరగతి చదువుతున్న జి.శిరీష చేసిన క్రాఫ్ట్ ప్రథమ స్థానంలో నిలిచింది. అలాగే కె.సత్యసాయి, కె.శివశంకర్‌లకు సర్టిఫికెట్లు వచ్చాయి. ఈ సందర్భంగా క్రాఫ్ట్ టీచర్ లక్ష్మిని, విద్యార్థులను హెచ్ఎం పార్థసారథి, ఉపాధ్యాయులు అభినందించారు.

ఉత్సాహంగా స్వచ్ఛతాహి సేవ

రాజానగరం: దివాన్ చెరువులోని వీజేస్ ఫార్మసీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం స్వచ్ఛతాహి సేవ కార్యక్రమం నిర్వహించారు. స్వచ్ఛ భారత్, ఆరోగ్య భారత్, ప్లాస్టిక్ వినియోగాన్ని వదిలేద్దాం, కాటన్ సంచులు వాడదాం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుదామంటూ విద్యార్థులు నినాదాలు చేశారు. తొలుత కళాశాల ప్రాంగణంలో స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ డి.నరేంద్ర, కరస్పాండెంట్ డాక్టర్ ఎస్‌వీవీ జగన్మోహన్‌రెడ్డి, పీఓ డాక్టర్ బి.సునీల్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన రంగంపేట హైస్కూల్ విద్యార్థులతో ఉపాధ్యాయులు



వాలీబాల్ పోటీలకు అర్హత సాధించిన దొంతమూరు విద్యార్థితో ఉపాధ్యాయులు



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో హెచ్ఎం కల్యాణి, పీడీ రాజేశ్వరి



కబడ్డీ పోటీలకు ఎంపికైన జి.మామిడాడ విద్యార్థులతో ఉపాధ్యాయులు

రంగంపేట: కాకినాడలో జరిగిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అండర్-14 కబడ్డీ సెలక్షన్స్‌లో రంగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. జి.ఆదినారాయణ, డి.దుర్గాప్రసాద్ ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వారిని ప్రధానోపాధ్యాయుడు వి.పార్థసారథి, ఉపాధ్యాయులు అభినందించారు.

దొంతమూరు నుంచి ఒకరు

రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు తమ విద్యార్థి అర్హత సాధించినట్టు దొంతమూరు పాఠశాల హెచ్ఎం కేవీ రమణారావు తెలిపారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ కాకినాడలో జరిగిన ఎంపికల్లో అండర్ -14 బాలుర వాలీబాల్ పోటీల్లో తమ విద్యార్థి చంద్రమల్ల సిద్ధు రాష్ట్రస్థాయిపోటీలకు ఎంపికయ్యాడన్నారు. ఆ విద్యార్థితో పాటు పీడీ లక్ష్మిని సర్పంచ్ గోలి రమణ, ఎంపీటీసీ గోలి వెంకటకృష్ణ, గ్రామస్తులు, ఉపాధ్యాయులు అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు అనపర్తి విద్యార్థినులు

పెదపూడి: అనపర్తి బాలికోన్నత పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని ఆ పాఠశాల హెచ్ఎం కె.కల్యాణి తెలిపారు. ఆమె మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ కాకినాడలో గత నెల 26, 30 తేదీల్లో జరిగిన డిస్ట్రిక్ట్ సెలక్షన్‌లో టెన్నికాయిట్ విభాగంలో బి.అంకిత, టి.వినీల, స్విమ్మింగ్‌లో పి.సంజన, పి.హర్షిత లాస్య, అండర్ 19 క్రికెట్‌లో పి.సిరి, కె.సమితరాణి ప్రతిభతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఆ విద్యార్థులను పీడీ ఏ.రాజేశ్వరి, ఎంఎస్‌సీ చైర్మన్ నల్లమిల్లి విజయలక్ష్మి, ఉపాధ్యాయులు అభినందించారు.

కబడ్డీ పోటీలకు..

పెదపూడి: జి.మామిడాడ జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారని ఆ పాఠశాల హెచ్ఎం ఎస్.వెంకటరెడ్డి తెలిపారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ గత నెల 30న కాకినాడ డీఎస్ఏ గ్రౌండ్‌లో జరిగిన జిల్లా స్థాయి కబడ్డీ జట్టు ఎంపికలో తమ విద్యార్థులు కె.సత్యవేణి, జి.సంధ్య, బి.ప్రవల్లిక, కె.చైత్ర ప్రతిభ చూపారన్నారు. ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకు శ్రీకాకుళం జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. వారిని పీడీ కె.తులసి, పాఠశాల ఎస్ఎంసీ చైర్ పర్సన్ వల్లు శిరీష, వైస్ చైర్మన్ దడాల దుర్గ, ఉపాధ్యాయులు అభినందించారు.

హ్యాండ్ బాల్ పోటీలకు..

బిక్కవోలు: రాష్ట్ర స్థాయి అండర్ 19 హ్యాండ్ బాల్ పోటీలకు పందలపాకలోని పడాల పెద్ద పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మహిళా జూనియర్ కళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ విషయాన్ని పీడీ ద్వారంపూడి యువరాజారెడ్డి తెలిపారు. కాకినాడ పీఆర్ డిగ్రీ కళాశాలలో జరిగిన పోటీల్లో కళాశాల విద్యార్థి బి.భవాని, పాఠశాల చెందిన కొమ్ము శశి, నల్లమిల్లి లోహిత ప్రియ ప్రతిభ చూపారన్నారు. వీరు త్వరలో అనంతపురంలో జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అండర్ - 19 బాలికల హ్యాండ్ బాల్ పోటీలకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జట్టు తరపున ఆడనున్నట్లు తెలిపారు. హెచ్ఎం చిర్ల శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఆ విద్యార్థులు, పీడీని అభినందించారు.



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన పందలపాక క్రీడాకారులు